త్రలుపు తట్టుతున్న తీరులోనే ఏదో ప్రమాదం ధ్వనించి ఒక్క ఉదుటున లేచి తలుపు తెరిచింది రేఖ ఆమె శంకించి నట్లే తలుపు తెరవగానే శిరీష ఏడుస్తూ ఆమె భుజాలమీదకు వాలి పోయింది.

"శిరీషా! ఏమైంది?" ఆత్రంగా అడుగుతూ, ఆమెను గట్టిగా పట్టుకుని మంచంవేపు నడిపించింది.

ఆమె ఏమీ చెప్పలేనట్లు నీరసంగా మంచంమీద వాలి పోయింది. రేఖ కూజాకొంచి చల్లని నీళ్ళు తెచ్చి ఆమె కందిం చింది.

చల్లని చేతితో ఆమెను చాలా ఆప్యాయంగా అభిమానంగా దగ్గరకు తీసుకుని మళ్ళీ అడిగింది- "చెప్పవూ! ఏమైంది?"

"ఏమీ కాలేదు" అంది శిరీష బలహీనంగా, బాధగా.

"శిరీషా! మనం స్నేహితులం" ఆ విషయం ప్రత్యేకంగా జ్ఞాపకం చెయ్యవలసి వచ్చినందుకు విచారిస్తున్నట్లు కొంచెం నిష్ఠూరంగా అంది రేఖ.

ఆమె స్పర్శకీ, ఆ కంఠంలోని సన్నిహితత్వానికీ, కరగిపోయింది శిరీష. "వసంత్ డిన్నర్‌కి పిలిచాడు. వెళ్ళాను. తాజ్‌లో డిన్నరు అయ్యాక, వెన్నెల బాగుందంటే బీచ్‌కి నడిచాం. సముద్రమూ.... వెన్నెలా....ఏకాంతమూ..తియ్యని ప్రేమమాటలూ...." సిగ్గుపడుతున్నట్లాగిపోయింది.

"అర్థమైందిలే! అతను నీచేతిని తీసుకున్నాడు నువ్వేమీ అనలేదు. మెల్లగా కౌగిలిలోకి తీసుకున్నాడు. ఐనా నువ్వు కాదనలేదు. ఆతనింకా ముందుకి వెళ్ళబోతే, హద్దు మీరబోతే, పరుగెత్తుకు వొచ్చేశావు. ఔనా?"

ఆశ్చర్యం పట్టలేకపోయింది శిరీష "నీకెలా తెలుసు?"

"వసంత్ మగవాడూ, నువ్వు అందమైన అమ్మాయివీ. కథ చాలావరకూ యిలాగే జరుగుతుంది. నేను నీకంటే పెద్దదాన్నీ, అనుభవమున్నదాన్నీ కదా....!" తరువాత చెప్పమన్నట్లు చూపింది. శిరీష ఏమీ అనలేదు.

"మీరు ప్రేమించుకున్నారు.

## ఇచ్ఛాపురపు రామచంద్రం

త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నారుగా!"

"అందుకే. ఇంకా పెళ్ళి కాలేదనే. రేఖా! నన్ను వెనకబడిన దాన్ననుకున్నాసరే, పెళ్ళి కాకుండా హద్దుమీరడం నాకిష్టముండదు."

"పెళ్ళయ్యాక అది హద్దు మీరడం కానే కాదు" నవ్వింది రేఖ.

"ఇలా జరిగాక యిక అతను నన్ను చేసుకుంటాడనుకోను." విచారంగా, బాధగా పశ్చాత్తాపపడుతున్నట్లంది శిరీష.

"ఇలా జరిగింది కనుకనే విన్నతను తప్పకుండా చేసుకుంటాడు." చాలా కచ్చితంగా అంది రేఖ.

"అసంభవం! నీకు తెలీదు రేఖా! అతనినుంచి విడిపించుకుందుకు నేను తక్కువ బలమూ ఉపయోగించలేదు, మంచి పనులూ చెయ్యలేదు. చెంపలమీద రక్కులూ, చేతులమీది గాయాలతో వసంత్ వారంవరకూ వీధిలోకి రాగలడనుకోను."

"ఐతే, చాలా యుద్ధం చేయవలసి వచ్చిందన్నమాట!"

"ఊఁ - అతను మరీ మూర్ఖుడూ, రాక్షసుడూ ఐపోయాడు. దానితో నేనూ చాలా తీవ్రంగానే పోరాడాను."

"మంచి పని చేశావు. నీకు నా




హృదయపూర్వకాభినందనలు."

"ప్లీజ్, రేఖా! నన్నింకా బాధించకు." కన్నీటితో అందామె.

"లేదు, నేను నిజం చెబుతున్నాను. రేపు ఆదివారం కదా! వసంత్ వొచ్చి క్షమాపణలు చెప్పుకోడమే కాదు, వివాహానికి తేదీ కూడా నిర్ణయించి తీరతాడు. నా మాటమీద నమ్మకం వుంటే నిశ్చింతగా నిద్రపో! జరిగినది మంచికే."

"నీకెలా తెలుసు?"

రేఖ ఏమీ చెప్పలేదు. లేచి వెళ్ళి ఓ నిద్రమాత్రా, గ్లాసుతో నీళ్ళూ తెచ్చి, "చాలా వేళయింది. ఈ రాత్రి గాఢంగా నిద్రపోతే రేపటికి పూర్తిగా కోలుకుంటావు. వసంత్ వచ్చేసరికి నీరసంగానూ, నిద్రముఖంతోనూ ఉంటే ఏం బాగుంటుంది? బుద్ధిగా పడుకో" అంటూ మాత్ర మింగించింది.

ఐదు నిముషాల్లో శిరీష నిద్రలోకి జారిపోయింది.

రేఖకి మాత్రం నిద్ర రావడం లేదు. రాదు కూడా. అది ఆమెకి తెలుసు. ఒక్కసారి శిరీష వేపు చూసింది. అదృష్టవంతురాలను కుంది భారంగా నిట్టూర్చుతూ.

*

ఆదివారం సాయంత్రం. వాతావరణం బాగుంది పిటౌట్‌లో కూర్చుని టేప్‌రికార్డర్ లోంచి వస్తున్న మంచి సంగీతం వింటున్నారు- రేఖా శిరీషా మధ్యమధ్య ఫ్లాస్కులోంచి టీ పోసుకుని తాగుతూ. శిరీషకు మాత్రం చాలా ఆత్రంగా ఉంది మనసులో. 'రేఖ చెప్పినట్లు వసంత్ వస్తాడా నిజంగా?' నిజానికి రేఖ కూడా వసంత్ గురించే ఆలోచిస్తూంది. శిరీషకి తెలియని కథ అది.

అప్పటికింకా శిరీష ఉద్యోగంలోకి రాలేదు, రూమ్‌మేట్ కాలేదు. వసంత్ తనతో స్నేహం చేశాడు. ఇద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్ళి ప్రసక్తి తీసుకురాబోతూంది తను. వసంత్ డిన్నర్‌కి పిలిచాడు. డిన్నరయ్యాక బీచ్‌కి. వెన్నెల.... సముద్రం .... ఏకాంతం. అతను ఉద్రేకపడ్డాడు. తనని కౌగిలిలోకి తీసుకున్నాడు. ఎలాగూ పెళ్ళి చేసుకోబోతున్నాం కదా అనే ధీమాతో తను కాదనకుండా ఆనందంగా అమాయకంగా మనస్ఫూర్తిగా అతనిలో కలిసిపోయింది, కరిగిపోయింది. అంతే! ఆశ్చర్యకరంగా తరువాత అతను తనకి ఒంటరిగా దొరకలేదు- చాలా ప్రయత్నించి పట్టుకుంటే తప్ప. పెళ్ళి విషయం సూటిగా అడిగింది.

"ప్రేమకీ, పెళ్ళికీ వ్యత్యాస

ముంది రేఖ। తాను వివాహం చేసుకోవాలనుకునే స్త్రీ - వివాహానికి ముందు అతనికే అర్పించుకున్నా ఆ మగవాడామెను మనస్ఫూర్తిగా వివాహం చేసుకుందు కంగీకరించలేదు. వివాహ సమయానికి స్త్రీ పవిత్రంగా ఉండాలని కోరుకుంటారు చాలామంది మగవాళ్లు నన్ను చెడ్డవాడనుకున్నాసరే, ఆ వేళ - బీచ్‌లో - నువ్వు నన్ను తిరస్కరించి ఉంటే - నిన్ను వివాహం చేసుకోవాలని నేనే చాలా ఆత్రత పడేవాడిని. ఆ అవకాశం చేజారిపోయింది. సారీ..."

అలా సారీ చెప్పేసి అతను వెళ్ళిపోతూంటే, తను నిర్ఘాంతపోయింది చాలా దుఃఖించింది జరిగినదానికి. మగవాళ్ళ మనస్తత్వం ఎంత వింతయినది? పాపిష్టి, తన దురదృష్టాన్ని నిందించుకుంటూ మిగిలిపోయింది. వసంత్ నిజంగా చెడ్డవాడు కాదు చెడు అంటూ ఉంటే - మగవాడి మనస్తత్వానిదే.

ఆ చెడ్డ అధ్యాయం అలా ముగిశాక, తనూ వసంతూ కొంచెం పరిచయస్థులకంటె అధికంగా ప్రవర్తించలేదు. ఐతే - అతని సంగతేమో కాని - తనలో యింకా ఆ గాయం పచ్చిగానే ఉంది. శిరీషకివేమీ తెలియవు.

'అదృష్టవంతురాలు! రాత్రి వసంత్ నామె చాలా తీవ్రంగా నిరోధించింది కనుక - అతను శిరీషని పెళ్ళిచేసుకోవడం తథ్యం. తన కథ చెప్పి ఆమెను తలక్రిందులు చేయడం దేనికి- వాళ్ళు పెళ్ళిచేసుకోబోతున్నసమయంలో?'

శుభోదయం-యిద్దరికీ."

శిరీష కళ్ళు మెరిశాయి వసంత్‌ని చూడగానే

రేఖ అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది.

"ప్లీజ్....రేఖా... వెళ్ళిపోకు. నేను మాట్లాడాలని వచ్చాను." అర్థిస్తున్నట్లే అన్నాడతను విధిలేనట్లు కూర్చుని. ముగ్గురికీ టీలు సిద్ధం చేయసాగిందామె.

"రాత్రి నేను చాలా తొందరపడ్డాను. మూర్ఖంగా ప్రవర్తించాను. అందుకు - చాలా క్షమార్హుణ్ణి."

శిరీష ఏమీ అనకుండా మౌనంగా ఉండి పోవడంతో-

"సముఖంలో రాయబారాలు దేనికి? శిరీష కూడా చాల పశ్చాత్తాప పడుతుంది - మీ నుంచి తప్పించుకుందుకు, మీకు చాలా గాయాలే చేయవలసి వచ్చిందని" అంది రేఖ.

శిరీష గుండెలు తేలికయ్యాయి. 'రేఖ ఎంత తెలివైనది! నిన్నరాత్రి ఆమె చెప్పినట్లే జరుగుతూంది సరిగ్గా!'

"ఔను." నవ్వుతూ - షర్ట్ స్లీవ్స్ కొంచెం పైకి తీసి—

"ఈ గాయాలు రాత్రి నన్ను నిద్రపోనివ్వలేదు. ఒకటే ఆలోచనలు! క్షమాపణలు తెలుపుకుని- పెళ్ళి విషయంలో నిర్ణయం తెలిపేందుకు నిశ్చయించుకునేవరకూ నిద్రపట్టలేదు నాకు" అన్నాడు వసంత్.

'హ్యాట్సాఫ్ రేఖా!' అనుకుంది శిరీష ఆనందంగా 'రేఖ ఎంత అద్భుతంగా ఊహించింది! వసంత్ తనను వివాహం చేసుకోబోతున్నాడు. తనేం చెప్పాలి? ఉహూం! రేఖ తన తరఫున మాట్లాడుతుంది. తనకి-ఆమే పెద్దదిక్కు.'

"నీకు జ్ఞాపకముందా రేఖా? మనమూ ప్రేమించుకున్నాం. నీ విషయంలో మరోలా జరిగింది. నేను కోరగానే నువ్వు నామీద చాలా నమ్మకంతో నిన్ను సంతోషంగా అర్పించుకున్నావు...."

"వసంత్!" అరిచింది రేఖ.

చాలా అవమానించబడినట్లూ, కోపం వచ్చినట్లూ ఆమె ముఖం చాలా ఎరబడింది. "అవన్నీ అనవసరమూ అప్రస్తుతమూ కూడా."

"అదికాదు పెళ్ళికి ముందు హృదయాన్ని నిర్మలంగా ఉంచుకోవాలని...."

శిరీష ఆశ్చర్యంగా చూస్తూంది. ఆమెకి వింతగానూ బాధగానూ కూడా ఉంది. రేఖకీ వసంత్‌కీ మధ్య ఇటువంటి చరిత్ర!

"నేను- నిన్నూ ఆ రోజులనీ కూడా పూర్తిగా మరచిపోయాను." కోపంగా అంది రేఖ

"అలాగ కొంచెమూ ఎవరు చెప్పకుండా లొంగిపోయా వనే నిన్ను తిరస్కరించాను కదూ!"

"నిన్ను మనిషిగా నమ్మి నా జీవితం నాశనం చేసుకున్నాను. మళ్ళీ ఆ పాడు అధ్యాయం తిరగదోడకు." విసురుగా లేచింది రేఖ.

"రేఖా!" చటుక్కున ఆమె చెయ్యి పట్టుకున్నాడతను. అది ఆమెకు మరీ నచ్చనట్లు, చాలా కోపంగా, అతని చెంప ఛళ్ళు మనిపించింది. ఐనా అతనామె చెయ్యి వొదలలేదు. "నేను చేసిన నేరాని

ఇది చాలా చిన్న శిక్ష. శిరీష చేసిన గాయాలతో పోలిస్తే, మరీ చిన్నది...."

శిరీష చాలా తీవ్రంగా ఆలోచిస్తోంది. 'రేఖని మోసంచేసిన వసంత్‌ని తను పెళ్ళిచేసుకోడం ఏం సమంజసం? వసంత్‌కి బుద్ధి రావాలంటే...'

"రేఖా!....నీకూ శిరీషకీ మధ్య గల తారతమ్యం - నిన్న రాత్రి సంఘటనతో గీటురాయిమీద లాగ సుస్పష్టమైంది." మెల్లగా అన్నాడు వసంత్.

రేఖకి, వసంత్ మాటలేమీ బాగులేవు .... ముఖ్యంగా - శిరీష ముందు.

శిరీషకీ అతని మాటలు చేదుగానే ఉన్నాయి. 'వసంత్ చివరికి తేల్చబోతున్న దేమిటి? తనను వివాహం చేసుకుంటాడనేగా? కాని ....తను .... సమయం చూసుకుని యిక్కడినుంచి నిష్క్రమించి అతనికి తన అయిష్టం తెలపాలి. ఇప్పుడు - వసంతంటే తనకి చాలా అసహ్యం వేస్తుంది.'

"రేఖా! నేనూ నా ఆలోచనలూ కొంచెం ఎదిగా మనుకుంటాను. నా ఆలోచనలు మారాయి. పవిత్రత కంటె విశ్వాసమే విలువైనదీ అవసరమైనదీ ఏమో! శిరీషకు నాలో లేని విశ్వాసం-నీకుందని చక్కగా అర్థమయ్యాక - నిన్నరాత్రి రుజువయ్యాక - నిన్ను కాక మరొకరి నెలా వివాహం చేసుకుంటాను? అదృష్టవంతుడూ, సుఖజీవి కాదలుచుకున్న మగవాడు తనలో నమ్మకమున్న స్త్రీని వదులుకోడు. నాకు జ్ఞానోదయం ఐంది. ప్లీజ్... జరిగినది మరచిపో. శిరీషకి నా తరఫున క్షమాపణలు చెప్పు. మన వివాహానికి సాధ్యమైనంత దగ్గరలో తేదీ నిర్ణయించు ఎదురుచూస్తుంటాను!" శలవు తీసుకుని వెళ్ళిపోయాడు వసంత్.

రేఖ తెల్లబోయి ఉండిపోయింది.

"కంగ్రాట్స్ ... తేదీ త్వరగా నిర్ణయించు...." రేఖ భుజాల చుట్టూ చేతులువేసి అంటున్న శిరీష కంఠంలో ఆనందమే తప్ప కొంచెమయినా బాధకానీ, అసూయ కానీ లేవు.